ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 14 అక్టోబరు 2024

పంట కోతలు వాయిదా వేసుకోండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, అక్టోబరు 13: భారీ వర్షాల నేపథ్యంలో వేరుశనగ, ఇతర రకాల పంటల కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే పంట కోత పూర్తయి ఉంటే టార్పాలిన్‌తో పంటను కప్పి ఉంచాలని, లేనిపక్షంలో పచ్చి కట్టే నూర్పిడి చేసే యంత్రాలతో పంట నూర్పిడి చేసుకోవాలన్నారు. వర్షం సమయంలో పండించిన పంటను బహిరంగ మైదానంలో ఉంచకూడదన్నారు. వర్షం పడుతున్న సమయంలో పురుగు మందులు, ఎరువులను పిచికారి చేయకూడదన్నారు.

మొండి గోడలు..!

వైసీపీ హయాంలో అనాలోచిత నిర్ణయాలు

- యార్డులో అర్ధంతరంగా ఆగిన నిర్మాణ పనులు
- పాతూరు కూరగాయల మార్కెట్ తరలించే యోచన
- అధికారులు.. వ్యాపారులు వద్దన్నా వినని పాలకవర్గం
- బిల్లులు రాకపోవడంతో పనులను ఆపేసిన కాంట్రాక్టర్



మొండిగోడలకు పరిమితమైన షాపింగు రూములు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో దుకాణ గదుల నిర్మాణం ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడంతో రెండేళ్ల కిందట పనులను ఆపేశారు. నిర్మాణాలు పూర్తయితే ఏదో ఒక అవసరానికి వినియోగించుకోవచ్చు. అర్ధంతరంగా వదిలేయడంతో నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. మరుగుదొడ్లను తలపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పాలకవర్గ సభ్యుల అనాలోచిత నిర్ణయాలే ఈ దుస్థితికి కారణమని విమర్శలు వస్తున్నాయి. యార్డులోని మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయం వెనుకభాగంలో గదులను నిర్మించి.. పాతూరులోని కూరగాయల మార్కెట్‌ను ఇక్కడికి తరలించాలని భావించారు. నిర్మాణ పనులకు రూ.5.05 కోట్ల నిధులను కేటాయించారు. సుమారు 93 దుకాణాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. తిరుమల కన్‌స్ట్రక్షన్‌కు నిర్మాణ పనులను అప్పగించారు. నూతన నిర్మాణాల పేరిట బాగున్న రెండు గోదాముల పైకప్పులను తొలగించారు. అందులో పిచ్చుక గూడు లాంటి కొన్ని గదుల నిర్మాణం చేపట్టారు. కొన్ని పూర్తి చేసి.. మరికొన్నింటిని గోడల వద్ద ఆపేశారు. పది గదులు మినహా.. అన్నీ అసంపూర్తిగానే ఉండిపోయాయి. ఈ పనుల కోసం యార్డు అధికారులు రూ.1.70 కోట్లు సీఎఫ్ఎంఎస్ జమ చేసినట్లు తెలుస్తోంది. కానీ కాంట్రాక్టర్‌కు మాత్రం ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాలేదు.

- అనంతపురం రూరల్

● వద్దంటున్నా...

మార్కెట్ యార్డులో కూరగాయల దుకాణాల ఏర్పాటును ఆ శాఖ అధికారులు వ్యతిరేకించినట్లు సమాచారం. కానీ నాటి పాలకవర్గంలో కీలక వ్యక్తి పట్టుబట్టి మరీ పనులను ప్రారంభించారని అంటున్నారు. అప్పట్లో పనిచేసిన యార్డు అధికారులకు, పాలకవర్గంలోని ఆ వ్యక్తి ఏమాత్రం పొసగలేదని సమాచారం. పాతూరు కూరగాయల మార్కెట్‌ను మార్కెట్ యార్డులోకి మార్చాలని ఆయన భావించారు. కానీ కూరగాయల వ్యాపారులు అయిష్టత వ్యక్తం చేశారు. కొన్నేళ్ల నుంచి పాతూరులో వ్యాపారం చేస్తున్నామని, ఇది తమకు అనుకూలంగా ఉందని వారు చెప్పినట్లు సమాచారం. కొత్త ప్రాంతంలో అద్దె ఎక్కువగా ఉంటుందని, వ్యాపారాలు జరుగుతాయన్న గ్యారెంటీ లేదని అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. మార్కెట్ యార్డులో గదులకు ఎంతలేదన్నా నెలకూ రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని, గది విస్తీర్ణాన్నిబట్టి ఇంకా ఎక్కువగానే అద్దె ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. కానీ అధికారంలో ఉండటం, అప్పటి ప్రజా ప్రతినిధి కాదనరనే ధీమాతో యార్డులో నిర్మాణాలను ప్రారంభించారు.



మార్కెట్ యార్డు

ఇంజనీరింగ్ విభాగానికే సంబంధం..



నిర్మాణ బాధ్యతలన్నీ ఇంజనీరింగ్ విభాగానికే సంబంధం. మాకు ఎలాంటి సంబంధం లేదు. చేసిన పనులకు బిల్లు చెల్లించడం మాత్రమే మా పరిధిలో ఉంటుంది. చేసిన పనులకు గతంలోనే అప్పటి అధికారులు సీఎఫ్ఎంఎస్‌కు కొంత సొమ్ము జమ చేశారు.

-గోవిందు, యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి

బిల్లు పెండింగ్..

మార్కెట్ యార్డులో దుకాణ గదులు, చీనీ మార్కెట్‌లో కవర్ షెడ్డు నిర్మాణ బాధ్యతలను ఒకే కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. కవర్ షెడ్డు నిర్మాణం చాలా వరకు పూర్తి అయింది. దుకాణ గదుల నిర్మాణం కొంతమేరకే పూర్తి అయింది. వీటన్నింటికీ కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశారు. కాంట్రాక్టు గడువు కూడా పూర్తి అయింది. ఈ అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

- రఘునాథ్, డీఈ, ఇంజనీరింగ్ విభాగం, మార్కెటింగ్ శాఖ



పైకప్పు వేయకుండా వదిలేసిన షాపింగు రూములు

ఏం సాధించారు..?

యార్డులో పశువుల సంత, చీనీ మార్కెట్ బాగా జరుగుతోంది. వాటిని నుంచి యార్డుకు మంచి ఆదాయం సమకూరుతోంది. చీనీ మార్కెట్‌కు రాష్ట్రంలోనే మంచి పేరుంది. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల దిగుబడులు కూడా ఇక్కడికి వస్తుంటాయి. సీజన్‌లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో చీనీ మార్కెట్‌ను విస్తరించాలని యార్డు అధికారులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. పశువుల సంత కూడా మంచి పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం పశువుల సంత జరిగే ప్రాంతం వరకు చీనీ మార్కెట్‌ను విస్తరిస్తే.. ఉపయుక్తంగా ఉంటుంది. కూరగాల మార్కెట్ పేరిట నిర్మాణాలు చేపట్టిన ప్రాంతానికి పశువుల సంతను మార్చి ఉంటే ప్రయోజనం ఉండేది. అదే ప్రాంతంలో గోదాముల నిర్మాణానికీ వెసులుబాటు ఉండేది. యార్డు ప్రహరీ నిర్మాణం, పశువుల సంత ప్రాంతంలో రోడ్డు నిర్మాణం తదితర ప్రతిపాదనలను వైసీపీ హయాంలో తొక్కిపెట్టారు. కూరగాయల మార్కెట్ తరలింపు పేరిట డబ్బు వృథా చేశారు. పైగా నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేశారు. ఏకపక్ష నిర్ణయాలతో యార్డుకు నష్టం చేకూర్చారని విమర్శలు వస్తున్నాయి.



గోదాములో నిర్మించిన పిచ్చుక గూడు లాంటి షాపు రూములు



కొంత పూర్తయిన షాపింగు రూములు

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

కలెక్టరు వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 13: జిల్లాలో 14 నుంచి 16వతేదీ వరకు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టరు ఆదేశించారు. పట్టణాలు, గ్రామాలలో డ్రైనేజీల ద్వారా వర్షపు నీరు నిలబడకుండా ఉండేందుకు వెంటనే శుభ్రం చేయాలన్నారు. నీటిప్రవాహ మార్గాలను వీక్షించడానికి డ్రోన్‌లను వినియోగించాలని సూచించారు. పంట నష్టాలు జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లు, కాలువలలో నీటిమట్టాలను జలవనరులశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులతో పాటు ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఇతర మండలశాఖల అధికారులు అందరూ అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

లక్కీ డే..!

నేడు మద్యం షాపులకు లాటరీ



- 136 దుకాణాలకు 3265 దరఖాస్తులు
- ప్రభుత్వ ఖజానాకు రూ.65.30 కోట్ల ఆదాయం
- 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం

అనంతపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటు మద్యం పాలసీ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం చేకూరింది. జిల్లాలో 136 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా.. భారీ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) అయినప్పటికీ మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులు దరఖాస్తులు చేయడంలో పోటీ పడ్డారు. మొత్తం మీద 3265 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ప్రభుత్వ ఖనాజాకు ఏకంగా రూ.65.30 కోట్లు ఆదాయం సమకూరింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో దుకాణానికి సగటున 20 నుంచి 26 దరఖాస్తులు వస్తాయనే అంచనా వేసింది. జిల్లాలో ఆ లెక్కన చూసుకుంటే ప్రభుత్వ అంచనాకు తగ్గట్టుగానే దరఖాస్తులు వచ్చాయి. ఒకటి, రెండు నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాలకు 3 నుంచి 10 దరఖాస్తులు కూడా రాకపోవడం పట్ల కారణాలను విశ్లేషించే అవకాశం ఉంది. ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ నాయకుల జోక్యం, బెదిరింపులు, సిండికెట్ల వ్యవహారంపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. తక్కువ దరఖాస్తులు వచ్చిన మద్యం దుకాణాల వివరాలపై సంబంధిత శాఖ అధికారులతో ప్రభుత్వం నివేదిక కోరినట్లు సమాచారం.

ఎక్సైజ్ స్టేషన్ వారిగా దరఖాస్తుల వివరాలు

ఎక్సైజ్ స్టేషన్	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు
అనంతపురం	41	1300
బుక్కరాయసముద్రం	15	542
గుత్తి	18	253
గుంతకల్లు	14	242
తాడిపత్రి	16	103
ఉరవకొండ	7	255
కణేకల్లు	6	146
రాయదుర్గం	8	231
కళ్యాణదుర్గం	7	143
కంబదూరు	4	50
మొత్తం	136	3265


లక్కు ఎవరిదో..!

జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల లెక్క తేలిపోయింది. 136 దుకాణాలకు 3265 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 8 గంటలకు జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో లాటరీ పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించనున్నారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామిల ఆధ్వర్యంలో మద్యం దుకాణాల నెంబర్ల వారిగా లాటరీ తీయనున్నారు. ఏ దుకాణానికి ఎంత మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారో.. వారి సమక్షంలోనే లాటరీ తీయనున్నారు. దీంతో లక్కు ఎవరికి దక్కేనో అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కాగా మద్యం దుకాణాల లాటరీ నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

16 నుంచి అన్ని బ్రాండ్లు అందుబాటులోకి

లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఈనెల 16న మద్యం దుకాణాలను ప్రారంభించనున్నారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచలేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్న ఆరోపణలను గత వైసీపీ ప్రభుత్వం మూటగట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి దుకాణంలోనూ నాణ్యమైన అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తేనున్నారు. దీంతో మద్యం ప్రియుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

గ్రామాలకు జల సిరి



ఇప్పేరు చెరువులో నీరు



బోర్లకింద సాగు చేసిన వరిపంట

కూడేరు, అక్టోబరు 13: హంద్రీనీవా రాకతో మండలంలోని ముద్దలాపురం, ఇప్పేరు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌మండలి చీఫ్‌విప్‌గా ఉన్న సమయంలో చోళసముద్రం గ్రామ సమీపంలో వెళ్తున్న హంద్రీ నీవా ప్రధాన కాలువ నుంచి ముద్దలాపురం, ఇప్పేరు గ్రామ చెరువులకు నీరు తీసుకురావడానికి చొరవ చూపారు. ఇందులో భాగంగా 2.5 కిలో మీటర్ల ఉప కాలువ పనులు చేయించారు. కాలువకు అవసరమైన భూ సేకరణ కూడా పయ్యావుల సోదరుల చొరవతోనే పూర్తయ్యింది. ఈక్రమంలోనే ఈ ఏడాది ముద్దలాపురం, ఇప్పేరు చెరువులతోపాటు కరుట్లపల్లి చెరువు, చోళసముద్రం స్టోరేజ్ ట్యాంక్, జయపురం గ్రామ సమీపంలో చెక్ డ్యాంలను నీటిని నింపారు. దీంతో అన్నదాతలు మురిసిపోతున్నారు. వర్షం వస్తే తప్ప, పంటలు పండని మండలంలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కడంతో నేడు బీడు భూములు సైతం పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. బోరుబావులు సైతం రీచార్జ్ అయ్యాయి. దీంతో వేలాది ఎకరాలో చీనీ, దానిమ్మ వంటి ఉద్యాన పంటలు, టమోట, మిరప వంటి పంటలు రైతులు సాగు చేస్తున్నారు.

రెండు మండలాలకు ప్రయోజనం

ముద్దలాపురం, ఇప్పేరు చెరువులు నిండితే కూడేరుతోపాటు గార్లదిన్నె మండలాల్లోని పలు గ్రామాలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతాయి. కూడేరు మండలంలోని ఇప్పేరు, అంతరగంగ, కూడేరు, అరవకూరు, కమ్మూరు, గార్లదిన్నె మండలంలో కోటంక, మర్తాడు, తదితర గ్రామాలకు నీటి కష్టాలు తీరుతాయి. ఇప్పేరు చెరువులో నీరుంటే మర్తాడు మగ్గం గుంతలో నీరు ఉంటుందన్న పెద్దల మాటలు వాస్తవమని రైతులు చెబుతున్నారు. ఆ రెండు చెరువులో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరిగి వేలాది ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి.

హంద్రీ-నీవా, పీఏబీఆర్‌తో సస్యశ్యామలం

కూడేరు మండలానికి హంద్రీ-నీవా, పీఏబీఆర్ కుడికాలువల ద్వారా నీరు వదిలితే చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి నీరు చేరుతుంది. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ప్రస్తుతం హంద్రీ-నీవా నీరు మాత్రమే మండలానికి వస్తుండటంతో కరుట్లపల్లి, ముద్దలాపురం, ఇప్పేరు చెరువులు నిండాయి. పీఏబీఆర్ కుడికాలువ నీరు విడుదల చేస్తే మరుట్ల, అరవకూరు, రామచంద్రపురం తదితర గ్రామాల్లో చెరువులు, చెక్‌డ్యాంలో నీరు చేరి ఆ ప్రాంతంలో కూడా భూములు సాగులోకి వస్తాయి. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి పూర్తి స్థాయిలో నీరు మండలానికి చేరితే మండలంలోని అన్ని గ్రామాలు పంటలతో సస్యశ్యామలమవుతాయి.

నిండుకుండలా చెరువులు

రెండు మండలాల్లో పెరిగిన భూగర్భ జలాలు

వేలాది ఎకరాలు సాగులోకి..

ఎండిన బోర్లలో ఉబికిన నీరు



నేను మూడున్నర ఎకరాల పొలంలో చీనీ తోట సాగు చేస్తున్నా. అందులో రెండు బోర్లు ఉండగా, గతంలో ఇప్పేరు చెరువుకు నీరు రాకపోవడంతో ఒకటి పూర్తిగా ఎండిపోయింది. గత మూడేళ్లుగా ఉన్న ఒక బోరు తోనే చాలీ చాలని నీటితో చెట్లను కాపాడుకుంటూ వస్తున్న. ప్రస్తుతం పయ్యావుల సోదరుల సహకారంతో చెరువుకు నీరు రావడంతో ఎండిన బోరు నుంచి నీరు సమృద్ధిగా వస్తోంది. చెరువులో నీరుంటే మా జీవితాల్లో వెలుగులే.

-బాలన్న, అంతరగంగ గ్రామం

బోర్లలో పెరిగిన నీరు



ఇప్పేరు చెరువులో నీరుంటే మా బోర్లలో నీరు భారీగా పెరుగుతుంది. నేను నాలుగున్నర ఎకరాల్లో చీనీతోపాటు కొంత టమోట సాగు చేశా. రెండు బోర్లలో కలిసి ఒక ఇంచు నీరు రావడంతో చీనీ చెట్లకు సరిపోక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం రెండు బోర్లలో నీరు పుష్కలంగా వస్తున్నాయి. అందుకే చీనీ చెట్లను కాపాడుకుంటూనే టమోట పంటను కూడా సాగు చేశా. ప్రతి ఏడాది చెరువుకు నీరు వదిలితే బోర్లలో నీరు తగ్గవు.

- ఎద్దుల సుధాకర్, కూడేరు గ్రామం

టీడీపీతోనే అభివృద్ధి : కాలవ

రూ. 48 కోట్ల బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ



బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, అక్టోబరు 13: టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. మండలంలోని కోళకుర్తి వద్ద ఉన్న వేదవతి హగరి నదిపై నిర్మించనున్న బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాలవ మాట్లాడుతూ రూ. 48 కోట్ల ఎన్‌డీబీ నిధులతో బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, గృహనిర్మాణ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతోనే బ్రిడ్జి పనులకు నిధులు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్రం అనేక ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ తన విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు.

మొండి పట్టుతోనే నిధులు మంజూరు: పయ్యావుల కేశవ్, మంత్రి

కణేకల్లు - ఉరవకొండ మండలాలను కలిపే కోళకుర్తి బ్రిడ్జికి నిధుల మంజూరుకు ఎమ్మెల్యే మొండి పట్టే కారణమని మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో మంత్రి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఫోన్‌లోనే ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాయదుర్గం, ఉరవకొండ నియోజక వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పలు దఫాలుగా తనతోనూ, అన్ని శాఖల అధికారులతో చర్చించారన్నారు. ఆయన ఒత్తిడి భరించలేక ప్రజల సంక్షేమం కోసం నిధుల మంజూరుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపిందని తెలిపారు.

15శాతం కమీషన్ ఇవ్వాల్సిందే

ఆ సొమ్మును గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తాం

మద్యం వ్యాపారులకు జేసీపీఆర్ హెచ్చరిక

పెద్దవడుగూరు, అక్టోబరు 13: నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు ఆదాయంలో 15శాతం గ్రామాల అభివృద్ధికి తప్పనిసరిగా ఇవ్వాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని చౌడేశ్వరి అమ్మవారిని శనివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు ప్రభుత్వ ధనం, సహజ వనరులను అప్పనంగా దోచేశారని మండిపడ్డారు. మండలంలోని కొందరు వైసీపీ నాయకులు అధికార గర్వంతో విచ్చలవిడిగా భూ ఆక్రమణలు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, సెటిల్‌మెంట్లు, ఇసుకరవాణా, బెల్ట్‌షాపుల ద్వారా జేబులు నింపుకున్నారన్నారు. వారి నుంచి వడ్డీతో కలిపి అక్రమార్జన సొమ్ము వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం...

మద్యం షాపులకు టెండర్లు

దరఖాస్తు రుసుం చెల్లించిన ఎమ్మెల్యే అమిలినేని


ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబరు 13: 'ఎన్నికల్లో నా కోసం ఎంతో శ్రమించారు. ఇప్పుడు సమయం వచ్చింది. నా వంతుగా మీ అభివృద్ధికి కృషి చేస్తా' అన్న రీతిలో టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలకు ఇవ్వడానికి తన సొంత డబ్బుతో మద్యం షాపులకు టెండర్లు వేశారు. నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం టౌన్, కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో సుమారు 10 మద్యం షాపులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో టెండర్లు వేశారు. మద్యం షాపులకు దరఖాస్తు చేయడానికి రుసుం రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలి. నియోజకవర్గ కార్యకర్తల తరపున 10 మద్యం షాపులకు 75 మందితో సొంత డబ్బు చెల్లించి దరఖాస్తు చేయించారు. లాటరీ పద్ధతిలో ఎన్ని మద్యం షాపులు వస్తే, వాటినన్నింటినీ కష్టపడ్డ కార్యకర్తలకే ఇవ్వనున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఉచిత డీఎస్సీ శిక్షణ, ఉచిత డ్రైవింగ్, నిరుపేదలకు తోపుడు బండ్ల పంపిణీ, ఆలయాలకు విరాళాలు, ఉచిత వైద్య సదుపాయాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయం పంపిణీ, కంబదూరులో నిరుపేదల ముస్లిం కుటుంబానికి పక్కాగృహం నిర్మాణం కోసం రూ. 5 లక్షలు పంపిణీ చేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో అమిలినేని తన వంతు కృషి చేస్తున్నారు.

పశువుల కంటైనర్ బోల్తా

రెండు ఆవులు, రెండు ఎద్దుల మృతి

ధర్మవరంరూరల్, అక్టోబరు 13: కబేళాకు తరలిస్తున్న కంటైనర్ వాహనం బోల్తాపడి నాలుగు పశువులు మృతిచెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సీతారాంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. అనంతపురం నుంచి బెంగళూరుకు ఆవులు, ఎద్దులతో వెళ్తున్న కంటైనర్ వాహనం మార్గమధ్యంలోని సీతారంపల్లి క్రాస్ కేఎఫ్‌సీ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాలుగు పశువులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 8 తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న ధర్మవరంరూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే కంటైనర్ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. ఈ ప్రమాదంలో రెండు ఆవులు, రెండు ఎద్దులు మృత్యువాత పడగా, మరికొన్ని పరుగులు తీశాయి. మండల పశువైద్యాధికారి శేఖర్ అక్కడికి వెళ్లి గాయపడిన వాటికి వైద్యచికిత్సలు అందించి పోతులనాగేపల్లి వద్ద ఉన్న గోశాలకు తరలించారు. మృతిచెందిన వాటిని పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ఆవులు, ఎద్దులను పట్టుకునేందుకు సంచరిస్తున్న ముఠా


ఆవులు, ఎద్దుల కళేబరాలు

మూగరోదన

కంటైనర్ బోల్తాపడటంతో ఆవులు, ఎద్దులు ఒకదానిమీద ఒకటి పడ్డాయి. ఊపిరిరాడక కొన్ని, కాళ్లు, కొమ్ములు విరిగి మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. తెల్లవారుజామున కావడంతో జనసంచారం లేక ఆవుల మెడకు చుట్టుకున్న తాళ్లు తెంపేవాళ్లు లేక ఆ మూగజీవాలు మూగరోదనతో మృత్యువాతపడ్డాయి. గాయపడ్డ మరికొన్ని ఆవులు తీవ్ర రక్తస్రావంతో రోదించాయి. ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లిన స్థానికులు ఆ పరిస్థితిని చూసి చలించిపోయారు.


బోల్తాపడిన కంటైనర్

యథేచ్ఛగా పశువులు తరలించే ముఠా సంచారం

ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసి బెంగళూరు తదితర ప్రాంతాల్లోని కబేళాలకు తరలించే ముఠా సభ్యులు ప్రమాదం విషయం తెలియగానే బెంగళూరు నుంచి సంఘటనా స్థలానికి వచ్చారు. కంటైనర్ వాహనంలో ఉండే ఎద్దులు, ఆవులు కొన్ని పొలాల్లోకి పారిపోయాయని తెలుసుకుని, వాటిని పట్టుకునేందుకు పొలాల్లో సంచరించారు. బెంగళూరు నుంచి కేఏ 53ఎంఈ 1011ఇన్నోవా వాహనంలో దాదాపు 10మంది మామిళ్లపల్లి, సీతారాంపల్లి, దాదులూరు, ముచ్చురామి గ్రామాల పొలాల్లో ఆవులను, ఎద్దులను పట్టుకునేందుకు సంచరించారు. ఆవుల ముఠా యథేచ్ఛగా అక్కడికి వచ్చిన ఆవులు, ఎద్దులను తరలించేందుకు సంచరిస్తున్నారని సమాచారం తెలిసినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అత్త, కోడలిపై అత్యాచారం

- అఘాయిత్యానికి పాల్పడిన పాత నేరస్థులు
- తండ్రీకొడుకులను కత్తులతో బెదిరించి ఘాతుకం
- చోరీ చేసి వస్తూ అకృత్యానికి పాల్పడిన వైనం
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- మరొకరి కోసం గాలింపు..
- దుండగుల్లో ముగ్గురు మైనర్లు



ధ్వంసమైన సీసీ కెమెరాలు

హిందూపురం, అక్టోబరు 13: చిలమత్తూరు మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఓ మిల్లు వాచ్‌మన్ కుటుంబంపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దారుణం జరిగింది. ద్విచక్రవాహనాల్లో వచ్చిన ఆరుగురు దుండగులు అత్తా కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అర్ధరాత్రి దాటాకా సోమందేపల్లి మండలంలో ఒకచోట చోరీకి పాల్పడిన ఆరుగురు దుండగులు మూడు ద్విచక్రవాహనాల్లో కంబాలపల్లి వైపు నుంచి టేకులోడు వైపు బయల్దేరారు. మిల్లు సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనాలు ఆపారు. ఇదే సమయంలో అక్కడ వాచ్‌మన్ టార్చ్‌లైట్ వేసి చూశాడు. దాంతో దుండగులు వాచ్‌మన్ వద్దకు వెళ్లి తాగునీళ్లు అడిగారు. అతడికి అనుమానం వచ్చి కొంత దూరంలో నీటి తొట్టి ఉందని చెప్పాడు. కానీ నీటి తొట్టితో మాకేం పని అంటూ వారు వాచ్‌మన్ కుటుంబం నివాసం ఉన్న రేకుల షెడ్డు వైపు వెళ్లారు. అడ్డుకునేందుకు యత్నించిన వాచ్‌మన్‌ను బెదిరించడంతో అతడు గట్టిగా కేకలు వేశాడు. దీంతో షెడ్డులో ఉన్న అతడి భార్య, కుమారుడు, కోడలు బయటికి వచ్చారు. చోరీకి వచ్చారని అనుమానించిన వాచ్‌మన్ కుటుంబం ఇక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయని చెప్పడంతో వాటిని ధ్వంసం చేశారు. తర్వాత అత్తా కోడలిని వేర్వేరు గదుల్లోకి లాక్కెళ్లారు. మిగిలిన వారు తండ్రీ కొడుకులను కత్తితో బెదిరించి, చితకబాదారు. దీంతోవారు నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. కుమారుడి వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కొన్నారు. దుండగుల్లో ఇద్దరు తండ్రీ కొడుకులను బంధించి ఉంచగా మిగిలిన వారు ఒకరి తరువాత ఒకరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. దాదాపు ఒకటిన్నర గంట పాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఏడాదిన్నర చిన్నారి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా దమనకాండకు ఒడిగట్టారు.

చోరీ చేసి వస్తూ అఘాయిత్యం

హిందూపురానికి చెందిన అంతర్రాష్ట్ర నేరస్థుడు, సుమారు 60కి పైగా కేసులు ఉన్న దొంగతో పాటు మరో ఇద్దరు పాత నేరస్థులు, ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనాల్లో శుక్రవారం సోమందేపల్లికి వెళ్లారు. అక్కడ చోరీ చేసుకుని 44వ జాతీయ రహదారిపై షార్ట్‌కట్ మార్గంలో కంబాలపల్లి మీదుగా వస్తున్నారు. ఈ సందర్భంలో నల్లబొమ్మనపల్లి, కంబాలపల్లికి మధ్య రోడ్డు పక్కనే నిర్మాణమవుతున్న ఓ మిల్లు వద్ద ద్విచక్రవాహనాలను ఆపారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కుక్కలు అరవడంతో కాపలా ఉన్న వాచ్‌మన్ అటువైపు టార్చ్‌లైట్ వేసి చూశాడు. అంతే దుండగులు అక్కడకు వెళ్లి దారుణానికి ఒడిగట్టారు. దుండగులు అక్కడ నుంచి వెళ్లిపోయిన అనంతరం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కుమారుడు సమీపంలో ఉన్న కంబాలపల్లికి వెళ్లి గ్రామస్థులకు విషయం తెలిపి, మిల్లు మేనేజర్‌కి సమాచారం అందించాడు. మేనేజర్ అక్కడికి చేరుకొని జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ మహేష్, ఇన్‌చార్జ్ సీఐ అబ్దుల్ కరీమ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ రత్న ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. వివరాలు తెలుసుకున్న అనంతరం హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పోలీసులు ఘటనా స్థలంలో నిందితుల ఆచూకీ కోసం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ని రప్పించారు. ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిందితుల వేలుముద్రలను సేకరించారు. అయితే నిందితుల్లో ఒకరిద్దరు మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు ధరించినట్లు తెలిసింది. అనంతరం దుండగులను పట్టుకునేందుకు డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

గంజాయి మత్తులోనేనా..?

సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు గంజాయి సేవించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ ఘటనకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలన నుంచి హిందూపురం ప్రాంతంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. దీంతో పాత నేరస్థులు గంజాయికి అలవాటు పడ్డారు. ఆ మత్తులో చోరీలతో పాటు ఇలాంటి అత్యాచారాలకు ఒడిగట్టుతున్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి దిగిన పోలీసులు

అత్తాకోడలపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను పట్టుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ నాలుగు బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు. వారు ఘటన జరిగిన ప్రదేశంలో సాంకేతిక పరమైన అంశాలతో పాటు అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా మొదట నిందితులను గుర్తించారు. అందులో ఉన్న అనుమానితులను బాధిత కుటుంబానికి చూపించి, అనంతరం దర్యాప్తుని వేగవంతం చేశారు. శనివారం రాత్రికే నిందితుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే అఘాయిత్యానికి పాల్పడిన వారు ముగ్గురు పాత నేరస్థులు కాగా, మరో ముగ్గురు మైనర్లు అని తెలిసింది. వీరిలో ఒకరు పరారీలో ఉన్నారు. కానీ వీరంతా హిందూపురం పట్టణానికి చెందిన వారేనని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీరు గత ఐదేళ్లుగా విచ్చలవిడిగా నేరాలకు పాల్పడినట్లు సమాచారం.

పదుల సంఖ్యలో అఘాయిత్యాలు

అత్తాకోడలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు గత ఐదేళ్లలో చిలమత్తూరు ప్రాంతంలో ఒంటరిగా వెళుతున్న వారిపై దాడి చేసి దోచుకున్నారు. పదుల సంఖ్యలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు కూడా పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కానీ బయటకి చెప్పితే ఎక్కడ తమ పరువు పోతుందోనని బాధితులు ఇప్పటి వరకు చెప్పకపోవడం గమనార్హం.

రహస్యంగా విచారణ

అదుపులోకి తీసుకున్న నిందితులను హిందూపురం కాకుండా వేరే ప్రాంతానికి తీసుకెళ్లి రహస్యంగా విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

ఆందోళనలో పల్లె వాసులు

కాగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కొంతమంది పొలాల వద్ద బోర్లు వేసుకొని, కొందరు అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే ఈ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఊరికి దూరంగా నివాసాలున్న కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. అంతేకాక పోలీసుల విచారణలో వెల్లడైన అంశాలు బయటికి తెలిస్తే మరింత ఆందోళన చెందే అవకాశం ఉంది.

ఎంట్రీ పాస్ ఉంటేనే అనుమతి

- ఉదయం 7 గంటల్లోపే జేఎన్‌టీయూకు చేరుకోండి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, అక్టోబరు 13 : మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వ్యాపారులను ఎంట్రీ పాస్ ఉంటేనే జేఎన్‌టీయూలోకి అనుమతి స్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగద్దయ్య, సూపరింటెండెంట్ రామ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటల్లోపే జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియానికి దరఖాస్తుదారులు చేరుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు సెట్‌తోపాటు ఎంట్రీ పాస్, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎంట్రీ పాస్ డౌన్‌లోడ్ చేసుకొని ఉంటారన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ పర్యవేక్షణలో అత్యంత పకడ్బందీగా మద్యం షాపులకు దరఖాస్తుదారు ల సమక్షంలోనే లాటరీ తీస్తామని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుదారులు అందరూ తప్పని సరిగా 7 గంటలకు చేరుకోవాలని కోరారు.

గ్యాంగ్ రేప్ అమానుషం: ఎంపీ బీకే

పెనుకొండ, అక్టోబరు 13: చిలమత్తూరు మండలం నల్లబోయనపల్లి గ్రామానికి బళ్లారి నుంచి ఉపాధి కోసం వచ్చిన వాచ్‌మెన్, అతని కుమారున్ని కత్తులతో బెదిరించి వారి భార్యలపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన అమానుషమని ఎంపీ బీకే పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన దుండగులను వదిలే ప్రశ్నేలేదన్నారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి కూడా సీరియస్ అయ్యారన్నారు. దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి: మాజీమంత్రి

హిందూపురం, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ అన్నారు. చిలమత్తూరు మండలంలో జరిగిన ఘటనకు సంబంధించి బాధితులను పరామర్శించేందుకు ఆమె హిందూపురం వచ్చారు. ఈ సందర్భంగా పట్టణ టూటౌన్ సీఐ కరీంని కలిశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. కానీ అక్కడ బాధితులను పరామర్శించేందుకు పోలీసుల అనుమతి లేకపోవడంతో విలేకరులతో మాట్లాడారు. అత్తా కోడలిపై జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్ దీపిక, వేణురెడ్డి, పొగాకు రామచంద్ర నాయకులు పాల్గొన్నారు.

తుంగభద్రకు భారీ వరద.. తెరుచుకున్న గేట్లు


విడుదలవుతున్న నీరు

బళ్లారి సిటీ, అక్టోబరు 13: కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర నదికి వరద పెరిగింది. హొస్పేట్ సమీపంలోని తుంగభద్ర జలాశయానికి (టీబీ డ్యాం)కి 84,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం నిండుగా ఉండటంతో 82,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో దాదాపు 11వేల క్యూసెక్కులు కాలువలకు, 20 క్రస్ట్‌గేట్ల ద్వారా 71 వేల క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు శనివారం తొలుత 18 గేట్లను తెరిచారు. తర్వాత మరో రెండింటిని తెరిచారు. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జలాశయం నుంచి నదికి నీటిని వదలడం ఇది మూడోసారి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1632 అడుగులుకాగా.. ప్రస్తుతం 1631.97 అడుగుల మేర నీరు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 101.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మెడికల్ షాపు నిర్వాహకుడి ఆత్మహత్య

ధర్మవరం, అక్టోబరు 13: అప్పులబాధ తాళలేక మెడికల్ షాపు నిర్వాహకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శనివారం జరిగింది. సిద్ధయ్యగుట్టకు చెందిన శ్రీనివాసులు (40) మెడికల్ ఏజెన్సీ, మందుల షాపు నిర్వహిస్తున్నాడు. వీటి నిర్వహణకు అప్పులు చేశాడు. వ్యాపారం సరిగా జరగకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలి అంటూ మథన పడేవాడు. దసరా పండుగ రోజు భార్య సంగమేశ్వర ఆలయానికి వెళ్లి వస్తానని వెళ్లింది. దీంతో ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నాడు. గుడి నుంచి వచ్చిన అతడి భార్య తలుపులు తట్టినా తీయకపోవడంతో పొరుగు వారికి తెలిపింది. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టారు. ఇంట్లోకి వెళ్లగానే ఉరికి వేలాడుతున్న భర్త శ్రీనివాసులును చూసి ఆమె బోరున విలపించింది. స్థానికుల సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మార్కెట్‌కు తగ్గిన టమోటా

అనంతపురంరూరల్, అక్టోబరు 13: కక్కలపల్లి మార్కెట్‌కు ఆదివారం టమోటా దిగుబడులు తగ్గాయి. మార్కెట్‌లోని అన్ని మండీలకు కలిపి 225 టన్నుల టమోటా కాయల వచ్చాయి. దసరా పండుగ నేపథ్యంలో మార్కెట్‌కు కాయలు తగ్గినట్లు తెలుస్తోంది. కాగా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.55తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కిలో సరాసరి ధర రూ.44, కనిష్ఠ ధర రూ.36 పలికినట్లు తెలిపారు.

నీటికోసం రైతుల వాగ్వాదం


తూము వద్ద ఉన్న రైతులు

నార్పల, అక్టోబరు 13: మండలంలోని హెచ్చెల్సీ తూము వద్ద శనివారం రాత్రి నీటి కోసం కూరగానిపల్లి, వెంకటాంపల్లి రైతుల వాగ్వాదానికి దిగారు. కూరగానపల్లి హెచ్చెల్సీ తూము వద్దకు వెంకటాంపల్లి రైతులు చేరుకున్నారు. తూము వద్ద తమకు నీరు రాకుండా కూరగానిపల్లి రైతులు అడ్డుకట్ట వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కూరగానిపల్లి రైతులు తూము వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ రెండు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు తూము వద్ద వేసిన అడ్డుకట్టను వెంకటాంపల్లి గ్రామస్థులు తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. నీటి విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

భర్తను చంపిన భార్య అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరంరూరల్, అక్టోబరు 13: రూరల్ మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన గోవిందు హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు ధర్మవరం రూరల్ సర్కిల్ ఇన్‌చార్జి, టూటౌన్ సీఐ రెడ్డప్ప, బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. హత్యకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. ధర్మపురి గ్రామానికి చెందిన గోవిందు, అంజినమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు అయిపోయాయి. అయితే కొన్నేళ్లుగా గోవిందుకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని అంజినమ్మ అనుమానిస్తుండేది. గోవిందు కూడా భార్య పట్ల అనుమానంతో ఉండేవాడు. ఈ విషయంగా వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో ఈనెల 10న మధ్యాహ్నం వారు మరోమారు గొడవకు దిగారు. తన గొంతుపట్టుకున్న భర్తను రోకలిబండతో అంజినమ్మ కొట్టింది. గోవిందు మృతి చెందాడు. 12న రావులచెరువు క్రాస్ సమీపంలో అంజినమ్మను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించిందని పోలీసులు తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.3.45లక్షలు

అనంతపురంరూరల్, అక్టోబరు 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో రూ.3,45,200 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,15,000, ఆదివారం జరిగిన గేదెలు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,30,200 వచ్చిందని తెలిపారు.

చిచ్చురేపిన శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసం

మద్దలచెరువులో ఇరువర్గాల వాగ్వాదం

కనగానపల్లి, అక్టోబరు 13: ప్రశాంతంగా ఉన్న గ్రామంలో శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసాలు ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి మద్దలచెరువు గ్రామంలో టీడీపీ వర్గీయుల శిలాఫలకాన్ని, వైఎస్సార్, మద్దలచెరువు సూరి విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై శనివారం ఉదయం టీడీపీ, వైసీపీ వర్గీయులు వాగ్వాదానికి దిగారు. ఈ సంఘటనలపై పరస్పరం ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో కనగానపల్లి పోలీసులు గ్రామానికి వెళ్లి బందోబస్తు ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు.

సీమ కవిత్వసారానికి ప్రతిబింబాలు

పుస్తకావిష్కరణ సభలో వక్తలు


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13: రచయితలు వెంకటకృష్ణ, శ్రీనివాసగౌడ్ రచించిన రవ్వలసవ్వడి, రాయలసీమ సాహితీ విమర్శ రచనలు సీమ కవిత్వసారానికి ప్రతిబింబాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సభలో పుస్తకాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాయలసీమ సాహిత్యానికి, విమర్శకు కొత్త చేర్పు ఈ రచనలని అన్నారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ నాగేశ్వరాచారి, సీనియర్ రచయితలు తూముచెర్ల రాజారాం, ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, కంబదూరి షేక్ నబీరసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, గోసల నారాయణస్వామి, చేగువేరా హరి, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, అశ్వత్థరెడ్డి, టీవీ రెడ్డి, కటకం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి వ్యాపారి మృతి


మృతిచెందిన అనీసుల్లాఖాన్

పెనుకొండరూరల్, అక్టోబరు 13: మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి పండ్ల వ్యాపారి అనీసుల్లాఖాన్(41) మృతిచెందాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు హిందూపురం మండలం నింకంపల్లికి చెందిన అనీసుల్లా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఈయన కుటుంబ సభ్యులతో కలిసి పెనుకొండకు వచ్చారు. ఆదివారం సరదాగా కుటుంబ సభ్యులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌ను సందర్శించడానికి వెళ్లారు. కాలువ నీటిలో అనీసుల్లా కుమారుడు సరదాగా ఈత కొడుతుండగా ఒక్కసారిగా మునిగాడు. అతన్ని రక్షించే క్రమంలో ప్రవాహంలో కొట్టుకపోయి రిజర్వాయర్ నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు హుటాహుటిన అతన్ని వెలికి తీసినా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య షమీమ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు.

సెలవుల కోసం వచ్చి గల్లంతు..

మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి అమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19)అనే డిగ్రీ విద్యార్థి ఆదివారం గల్లంతయ్యాడు. అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతున్నాడు. దసరా సెలవుల్లో భాగంగా స్వగ్రామానికి వచ్చాడు. చంద్రశేఖర్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం గొల్లపల్లి రిజర్వాయర్‌కు వెళ్లాడు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు ఇటీవలే నీరు విడుదల చేశారు. తన స్నేహితులతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి రిజర్వాయర్‌కు వస్తున్న కాలువలో ఈత కొడుతుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. స్నేహితులు, గ్రామస్థులు అరుపులు, కేకలు వేస్తుండగా నీటిలో గల్లంతయ్యాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా కియ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ వెంకటరమణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30వరకు గాలించారు. ఫైరింజన్ సిబ్బంది కూడా నీటిలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. చీకటిపడటంతో వెనుతిరిగారు. విద్యార్థి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు పెట్టారు.


రిజర్వాయర్‌లో గల్లంతైన విద్యార్థిని గాలిస్తున్న దృశ్యం

కన్నులపండువగా చక్రస్నానం


శ్రీవారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా కేంద్రంలోని ఆర్ఎఫ్ రోడ్డులో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుడికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారోత్సవం చేపట్టారు. ఆలయ కార్యవర్గం పుట్టపర్తి వెంకటరమణారెడ్డి, ఫ్లెక్సీ రమణ, కొండన్న, టిఆర్ వెంకటేష్‌గుప్త, గోపాల్, నాగరాజు, ఎవీ రావు, ప్రధానార్చకుడు హరికిషోర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు. - అనంతపురం కల్చరల్

హౌసింగ్‌బోర్డులో అమ్మవారి ఊరేగింపు


అమ్మవారిని ఊరేస్తున్న దృశ్యం

హౌసింగ్‌బోర్డు కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి రూపంలో అమ్మ వారు దర్శనమిచ్చారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం శ్రీవారికి చక్రస్నానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కేశవ చంద్రరావు, మేనేజింగ్ ట్రస్టీ ప్రతాప్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాసులురెడ్డి, అనీల్ కుమార్, లక్ష్మీదేవమ్మ, గోవిందు, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.
- అనంతపురం క్లాక్‌టవర్




అర్బన్‌బ్యాంకులో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజు గంగమ్మ చెంతకు దుర్గమ్మను చేర్చారు.అమ్మవార్ల వేషాధరణలో చిన్నారులు, అలరించిరు. నిమజ్జన ఊరేగింపులో బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, నృత్యం చేశారు.
-అనంతపురం క్లాక్‌టవర్

నేటి నుంచి పల్లె పండుగ

అనంతపురంరూరల్, అక్టోబరు 13: మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఆమేరకు ఆది వారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ కాలనీలో ఈ నెల 15వ తేదీన జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, 19వతేదీ ఆలమూరు గ్రామంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాప్తాడు: పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలను సోమవారం మండలంలోని బండమీదపల్లి, హంపాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు దాదులూరులో ఎమ్మెల్యే పర్యటన

కనగానపల్లి, అక్టోబరు13: మండలంలోని దాదులూరులో సోమవారం ఎమ్మెల్యే పరిటాలసునీత పర్యటిస్తారని టీడీపీ మండలకన్వీనర్ యాతం పోతలయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేస్తారని తెలిపారు.

నేడు పప్పుశనగ పంపిణీ

రామగిరి, అక్టోబరు 13: మండలంలో నల్లరేగడి భూములు కలిగి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు సోమవారం నుంచి పప్పుశనగ పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని, వారందరికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న జోగి లక్ష్మీనారాయణ (40) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈనెల 10వతేదీన రాప్తాడులో పోలీస్ స్టేషన్ వెనుక 44వ జాతీయ రహదారి పక్కన నడిచి వెళుతున్న ఇద్దరిని వెనుక వైపు నుంచి ఓ కారు ఢీకొంది. వారిలో రాప్తాడుకు చెందిన తలారి పోతులయ్య (38) అక్కడికక్కడే మృతి చెందగా, అయ్యవారిపల్లికి చెందిన జోగి లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నగర శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మీనారాయణ స్వగ్రామం అయ్యవారిపల్లి కాగా ప్రస్తుతం పాలచెర్లలో నివాసం ఉండేవాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు


గిరీష్ (ఫైల్)

కనగానపల్లి, అక్టోబరు13: మండలంలోని తగరకుంట గ్రామానికి చెందిన వి గిరీష్ అనే యువకుడు మూడురోజుల నుంచి కనిపించడంలేదని కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిరీష్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడని, ఈ క్రమంలో మూడు రోజుల నుంచి ఇంటికి రాలేదని ఆందోళన చెందుతున్నారు. అతడిని ఎవరూనా గుర్తించినట్లయితే తమకు సమాచారం అందించాలని కనగానపల్లి పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యంపై...


అంకాలమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం : మనవడి పుట్టిన రోజుకు నగరంలోకి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. పుట్లూరు మండలం ఎల్లుట్లకు చెందిన అంకాలమ్మ ఈనెల 9వ తేదీ తన మనవడి పుట్టిన రోజు వేడుకలకు నగరంలోని బుడ్డప్పనగర్‌లోని కుమార్తె ఇంటికి వచ్చింది. ఆమె 10వతేదీ ఉదయం 9.45గంటలకు ఊరికెళ్తానని చెప్పి నవోదయకాలనీ నుంచి బయలుదేరింది. కానీ ఊరికెళ్లలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. కొడుకు మిద్దె రమేష్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

అనంతపురం క్రైం,అక్టోబరు 13 : పండుగ రోజైన శనివారం ఉదయం సాయినగర్ నాలుగో క్రాస్‌లో ఓ మహిళ ఇంటి ఎదుట శుభ్రం చేస్తుండగా గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని గొలుసును లాక్కునే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో కింద గొలుసు పడిపోయింది. ఆ కుడి చేతికి గాయమైంది. ఆమె అరవడంతో అగంతకుడు అప్పటికే బైక్‌లో సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. అలాగే కొవ్వూరు నగర్‌లో లక్ష్మీదేవి అనే వృద్ధురాలు ఆదివారం పూల కోసం కొంతదూరం వెళ్లింది. తిరిగి వచ్చే సమయంలో ఇద్దరు అగంతకులు బైక్‌లో వచ్చారు. అందులో ఒకడు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అప్రమత్తమై పలు ప్రత్యేక బృందాలను నియమించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే డయల్ 100, 112కు సమాచారం అందించాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు.

ఘనంగా దసరా


మొదటిరోడ్డు రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద శమీవృక్ష ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


శంకరమఠంలో గజలక్ష్మిగా దర్శనమిస్తున్న శారదామాత

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13: దసరా వేడుకలు శని వారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయాలన్నింటి లో సందడి నెలకొంది. దసరా దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు భక్తులకు రోజుకొక అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు విజయదశమి సందర్భంగా శనివారం ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. గుల్జార్ పేటలోని కొత్తూరు వాసవీ ఆలయంలో మూలవిరాట్‌ను స్వర్ణకవచ చీరతో, ఉత్సవ మూర్తిని వాసవీ కన్యకాపరమేశ్వరి దర్బార్‌గా అలంకరించారు. పాతూరులోని వాసవీ ఆలయంలో మూలవిరాట్‌ను స్వర్ణకవచ చీరతో, ఆలయ ఆవరణలోని ఉత్సవమూర్తికి సప్తమాతృకల అలంకారం చేశారు. శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో అమ్మవారు గజలక్ష్మిగా, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. రామచంద్రనగర్‌లోని షిర్డీసాయి దేవాలయంలో అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం చేశారు. సాయినగర్ నాలుగో క్రాస్‌లోని కనకదుర్గ భవాని ఆలయం, జీసస్‌నగర్‌లోని రేణుకా యల్లమ్మ ఆలయం, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి ఆలయం, పాతూరులోని బీరప్ప గడివద్దనున్న యల్లమ్మ ఆలయం, అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం, ఐదోరోడ్డులోని రేణుకా యల్లమ్మ, మొదటిరోడ్డు, గుత్తిరోడ్డులోని చౌడేశ్వరి ఆలయాల్లోనూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో ఆలయాలన్నీ సందడిగా కనిపించాయి. పలుప్రాంతాల్లో ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఊరేగించారు.

నయనమనోహరం శయనోత్సవం


కొత్తూరు వాసవీ ఆలయంలో శయనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13 : జిల్లా కేంద్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నాటికి ముగిశాయి. పాతూరు, కొత్తూరు అమ్మవారిశాలల్లో ఆదివారం సాయంత్రం శయనోత్సవ సేవలతో వేడుకలను ముగించారు. పాతూరు అమ్మవారి శాలలో వాసవీమాత మూలవిరాట్‌ను కొబ్బరితో అలంకరించి పూజించారు. ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తితో శయనోత్సవ సేవ నిర్వహించారు. అదేవిధంగా కొత్తూరు అమ్మవారిశాలలో మూలవిరాట్‌ను వజ్రకవచ చీరతో అలంకరించి, సాయంత్రం ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తికి ఊయలసేవ చేశారు. భక్తులు విశేషంగా హాజరై వాసవీమాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, ప్రధాన కార్యదర్శి మిట్టా ఆంజనేయులు, టంగుటూరు నాగభూషణ, కృష్ణం రఘు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ప్రధాన కార్యదర్శి చల్లా కృష్ణరంగయ్య, ధర్మకర్త గర్లాల నాగరాజు, దూపకుంట సాయినాథ్ గుప్త, తిరువీదుల జగదీష్‌కుమార్, కొత్తూరు, పాతూరు యువజన సంఘాలు, వాసవీ మహిళా మండలుల ప్రతినిధులు, కార్యవర్గసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


పాతూరులో శయనోత్సవం..

కాలువకు దగ్గుపాటి జన్మదిన శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కాలువకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 13 : రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులుకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే కాలవ నివాసంలో పలువురు నాయకులతో కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాయల్ మురళీ, నాయకులు సుధాకర్‌నాయుడు, కూచి హరి, గంగారామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పీడీ సలీంబాషా ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డితో కలిసి డ్వామాలో అమలు చేస్తున్న పథకాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

'నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి'

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13: చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ఆదివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన దోషులను వెంటనే గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పోలీసులు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.

అనంతపురం విద్య : శ్రీ సత్యసాయి జిల్లాలో అత్తకోడలిని గ్యాంగ్ రేప్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తోడుగా నిలవాలన్నారు. సామూహిక అత్యాచారం చేసిన దోషులకు కఠిన జైలు శిక్షలు పడాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, అక్టోబరు 13 : ఆరునెలల క్రితం మృతి చెందిన తండ్రి తరచూ గుర్తుకు రావడం, అదే క్రమంలో మద్యం అలవాటు...చెల్లి పెళ్లికి చేసిన అప్పు ఓ యువకుడిని తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. ఈ క్రమంలో నగరానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన సంతోష్‌కుమార్(21) తన తాత వాళ్ల ఇంట్లో ఉంటాడు. ఆ ఇంటికి మూడిళ్ల పక్కనే తల్లిదండ్రులుంటారు. సంతోష్ కుమార్ పల్లవి టవర్స్‌లోని ఓ సెల్ పాయింట్‌లో పనిచేస్తుంటాడు. ఆరెల్ల క్రితం తండ్రి నాగేంద్ర ప్రసాద్ మృతి చెందడంతో అప్పటి నుంచి తండ్రి గురించి ఎక్కువగా ఆలోచించే వాడు. కొంతకాలంగా తాగుడుకు అలవాటుపడ్డాడు. ఈ నెల 11వ తేదీ తెల్లవారు జామున 3గంటలకు తన తల్లికి ఫోన్ చేసి భోజనముందా అని అడిగాడు. అందుకు ఆమె రాత్రి 10గంటలకు వస్తానని చెప్పి ఇంత ఆలస్యం చేస్తే ఎలా? అంది. ఇప్పటికే.. ఆలస్యమైంది తిరిగింది చాలు ఇంటికెళ్లి పడుకోమని చెప్పి ఫోన్ పెట్టేసింది. తాత ఇంట్లో పైగదిలోకి వెళ్లిన సంతోష్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరునాడు 12వతేదీ ఉదయం దసరా పండుగరోజు ఎంతసేపటికి దిగి రాకపోవడంతో... కుటుంబసభ్యులు పైకెళ్లి చూశారు. అప్పటికే సంతోష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం లాటరీకి పకడ్బందీ ఏర్పాట్లు

● జేసీ శివనారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్, అక్టోబరు 13 : ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపు కోసం లాటరీని పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు జేసీ శివనారాయణ్ శర్మ పేర్కొన్నారు. ఆయన శనివారం ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య, ఏసీ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డితో కలిసి స్థానిక జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. లాటరీ తీసే విధానంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఓపెన్ లాటరీ ప్రక్రియ కోసం ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా లాటరీని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన పౌరాణిక నాటకోత్సవాలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13 : ఏపీ సాంస్కృతికశాఖ సహకారంతో సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పౌరాణిక నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు రోజున సాయంత్రం అనంతపురం రూరల్ పరిధి లోని మన్నీల గ్రామంలో గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించారు. సత్యసాయిబాబా నాటకోత్సవ సమితి అధ్యక్షుడు మైఖేల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురంరూరల్, అక్టోబరు 13: మండలంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. దసరా పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో ఆదివారం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మవరానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ నృత్య గురువు బాబు బాలాజీ శిష్య బృందం ఆధ్వర్యంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అలాగే ఆదివారం అనంత నాగ్ సంగీత్ స్వర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త, పాత పాటల సంగీత విభావరి నిర్వహించారు.

తండ్రిని చంపిన కొడుకు


ఘటనా స్థలంలో పడిపోయిన రవీంద్రారెడ్డి

అనంతపురం క్రైం,అక్టోబరు 13: ఓ వ్యక్తి రోజూ తాగొచ్చి..ఇంట్లో గొడవ పడేవాడు. పండుగ రోజూ గొడవ పడగా, కొడుకు రోకలితో కొట్టడంతో తీవ్ర గాయమైంది. ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనశక్తి నగర్‌లో నివాసముంటున్న ఆవుల రవీంద్రారెడ్డి(54) పేకాట, మద్యానికి అలవాటు పడ్డాడు. రోజూ మద్యం మత్తులో ఇంటి కొచ్చి భార్య, పిల్లలతో గొడవపడేవాడు. శనివారం రాత్రి అలా గొడవపడ్డాడు. దీతో రవీంద్రరెడ్డి, అతడి కుమారుడు వేణుగోపాలకృష్ణారెడ్డి ఘర్షణ పడ్డారు. వేణుగోపాలకృష్ణా రెడ్డి రోకలితో తలవెనుక వైపు, ఎడమ ముంజేయిపై బలంగా కొట్టగా, రవీంద్రారెడ్డి స్పృహ తప్పి కిందపడ్డాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సాయినాథ్ తెలిపారు.

అబ్బాయిని కత్తితో పొడిచిన బాబాయ్

అనంతపురం క్రైం,అక్టోబరు 13: ఓ ద్విచక్రవాహనం (ఎక్సెల్)కోసం ఓ వ్యక్తి తన అన్నకుమారుడిని కత్తితో పొడిచాడు. నగరంలోని నీరుగంటి వీధికి చెందిన బాబామహమ్మద్, అతడి బాబాయి బాబా ఫక్రుద్దీన్ మధ్య శనివారం స్కూటర్ విషయంలో గొడవ జరిగింది. తానే రిపేర్ చేయించి ఉంచుకుంటానని బాబా ఫక్రుద్దీన్ ఆ స్కూటర్‌ను గుత్తిరోడ్డులోని ఓ మెకానిక్ సెంటర్‌లో ఇచ్చాడు. మరుసటి రోజు ఆ షెడ్‌కు వెళ్లగా ఆ వాహనం కనిపించకపోవడంతో బాబాయ్ వద్దకెళ్లాడు. దానిని అతను తీసుకెళ్లడంతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆవేశంతో ఫక్రుద్దీన్ మహమ్మద్‌ను కత్తితో పొడిచాడు. మహమ్మద్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా ముంటిమడుగు జన్మదిన వేడుకలు


కేశవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గేటు క్రిష్ణారెడ్డి, కూటమి సభ్యులు

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం, అక్టోబరు 13: టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. మండలంలోని గార్లదిన్నె, ఇల్లూరు, కల్లూరు, పెనకచెర్ల, కొప్పలకొండ, కోటంక, యర్రగుంట్ల, మర్తాడు, ముంటిమడుగు, కేశవాపురం, కొత్తపల్లి, బూదేడు తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి కేక్‌లు కట్‌చేశారు. అనంతరం కేశవరెడ్డిని గజమాలలు, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అధికంగా తరలివచ్చిన జనంతో కేశవరెడ్డి ఇంటివద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, గేటు క్రిష్ణారెడ్డి, ఆవులక్రిష్ణ, పాండు, జయరాం, గుత్తా బాలకృష్ణ, నరసింహారెడ్డి, చితంబరప్ప, సుంకన్న, వడ్డేవన్నూర్, శేఖర్, పవన్, రామాంజి, సోమశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, సురేష్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, పుల్లన్న, కొండయ్య, బాబయ్య, గోపాల్‌రెడ్డి, గోరకాటి వెంకటేష్, గోసుల సుబ్బయ్య, అంజి, సుధాకర్‌రెడ్డి, చలపతి, వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయ సముద్రం నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న పెనకచెర్ల నాయకులు


గజమాలతో సత్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, ఆవుల కిష్ట


శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ బుక్కరాయసముద్రం నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు

విపత్తు నివారణకు అప్రమత్తంగా ఉండండి

● సిబ్బందికి డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఉత్తర్వులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13 : జిల్లాకు అధిక వర్షసూచన, విపత్తు నివారణకు డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఆ శాఖ పీడీ ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలిసి సిబ్బందిని అప్రమత్తం చేయడంపై చర్చించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సోమవారం నుంచి 16వతేదీ వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ ప్రభుత్వేతర శాఖల సమన్వయంతో ధన, ప్రాణనష్టం కలగకుండా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఆయా ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు, గ్రామైక్య, మండల సమాఖ్యలతో కలిసి పనిచేసి ప్రజలకు అండగా నిలవాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోండి

● అధికారులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచన

శింగనమల, అక్టోబరు13: జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 16 వరకు భారీ వర్ష సూచన ఉన్నందుకు నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో అధికారులు ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శింగనమల మండలంలోని చాగల్లు రిజర్వాయర్ కింద ఉల్లికల్లు లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి : తహసీల్దార్

గార్లదిన్నె, అక్టోబర్ 13: జిల్లాలో రానున్న నాలుగురోజులు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందను అందరు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బండారు ఈరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు రానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

● పోర్టో నాయకుల డిమాండ్

అనంతపురం విద్య, అక్టోబరు 13 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రూ.25 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని పోర్టో రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అంకాల కొండయ్య ఇతర నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం డీఏ అరియర్స్, సరెండర్ లీవులు, సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు నగదు రూపంలో చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐసీ లోన్లు వెంటనే క్లియర్ చేయాలని కోరారు.

రాష్ట్ర కొత్త కార్యవర్గం ఎన్నిక...

పోర్టో రాష్ట్ర కొత్త కార్యవర్గాన్ని ఆది వారం ఎన్నుకున్నారు. నూతన చైర్మన్ గా కరణం హరి కృష్ణ, ప్రధానకార్యదర్శి గా అంకాల కొండయ్య, గౌరవాధ్యక్షు డిగా వెంకటరెడ్డి, ముఖ్య సలహా దారు లుగా ధనుంజయ రావు, కోశాధికారిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అలాగే మీడియా కన్వీనర్‌గా రమేష్, కో చైర్మన్లుగా బృందావన్ జోలై, శ్రీనివాస రావు, విజయలక్ష్మి, దుర్గారావు, షేక్ కరీముల్లా, సంయుక్త కార్యదర్శులుగా బీరప్ప, పెద్దన్న, శివశంకర్‌రెడ్డి, ఈరాలప్ప, వెంకటరమణమూర్తి, శ్రీహరి కోటి యోహాన్, అధికార ప్రతినిధులుగా మాగంటి శ్రీనివాసరావు, గరికపాటి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13: ప్రొగ్రెసివ్ సఫాయి కర్మాచారి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా జిల్లాకు చెందిన గుమ్మఘట్ట ఈశ్వరయ్య నియమితులయ్యారు. ఆ సంఘం నేషనల్ చైర్మన్ వీరాజు, సెక్రటరీ అంజిబాబు ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. తనకు అవకాశం కల్పించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐదుకల్లు సదాశివన్‌కు నివాళి

అనంతపురంరూరల్, అక్టోబరు13: హరిజనోద్ధరణకు ఆహర్నిశలు శ్రమించిన మహోన్నతుడు ఐదుకల్లు సదాశివన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. ఐదుకల్లు సదాశివన్ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ మండల సహాయ కార్య దర్శి నరేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ హాజరయ్యారు.

వాల్మీకి జయంతిపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

● తలారి ఆదినారాయణ, కుంటిమద్ది రంగయ్య

అనంతపురం అర్బన్, అక్టోబరు 13 : బీసీలకు టీడీపీ పుట్టినిల్లని మరో సారి రుజువైందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 17న వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని మంత్రి నారా లోకేశ్ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు.

చెన్నేకొత్తపల్లి: వాల్మీకి మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల టీడీపీ బీసీసెల్ సత్యసాయిజిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య హర్షం వ్యక్తం చేశారు. చెన్నేకొత్తపల్లిలో ఆదివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పాల్వాయి తిరుపాల్, ఆదినారాయణ, ఈశ్వరయ్య, నారాయణ, కుల్లాయప్ప, కాటమయ్య పాల్గొన్నారు.

16న అనంతపూర్ క్లబ్ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్: అనంతపూర్ క్లబ్ కమిటీ పదవీకాలం ముగియడంతో అడహాక్ కమిటీ నియామకం, క్లబ్ కార్యకలాపాలు యధావిధిగా సాగేందుకు ఈనెల 16న అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు క్లబ్ మాజీ సహాయ కార్యదర్శి లక్ష్మన్న, సభ్యులు రజాక్ తెలిపారు. అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

ముగిసిన అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీ

● రన్నరప్‌గా అనంతపురం బాలురు


అనంతపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన జీఎంసీ బాలయోగి స్మారక ఏపీ సబ్ జూనియర్స్ 9వ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీ శనివారం ముగిసింది. బాలురు, బాలికల విభాగాల్లో తూర్పు గోదావరి జట్లు విజేతలుగా నిలిచాయి. బాలురు విభాగంలో అనంతపురం జట్టు, బాలికల విభాగంలో కృష్ణా జట్టు రన్నరప్‌గా నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు, క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 13: జిల్లా స్థాయి చెస్ క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయి నగర్ రెండోక్రాస్‌లోని ఏ1 ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో జిల్లా అండర్-13 ఓపెన్, బాలికల చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-13 ఓపెన్ విభాగంలో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్, నితీష్‌చౌదరి, దర్శన్ ఎంపికయ్యారు. అండర్-13 బాలికల విభాగంలో లాలిత్య, త్రిపద, నౌమిక ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-13 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిశోర్, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, నేషనల్ ఆర్బిటార్ రవీంద్ర, టోర్నీ కోఆర్డినేటర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


యాడికిలో శమీ వృక్ష దర్శనానికి ఊరేగింపుగా వెళ్తున్న కన్యకాపరమేశ్వరీదేవి


కూడేరులో జమ్మి చెట్టు కింద సంగమ్మ సంగప్పల ఉత్సవ విగ్రహాలను ఉంచిన దృశ్యం


గుత్తిలోని పెనకల బావిలో రేణుకా ఎల్లమ్మకు తెప్పోత్సవం


ఉరవకొండలో శమీవృక్షం వద్ద భక్తుల సందడి

భక్తిశ్రద్ధలతో విజయదశమి

- అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున భక్తులు శమీవృక్ష దర్శనం, పూజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: దసరా పండుగ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ప్రతి గ్రామంలోనూ పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా ఆలయాల్లో తొమ్మిదిరోజుల పాటు వివిధ అలంకరణలలో దర్శనమిచ్చిన అమ్మవార్లకు పండగరోజున ప్రత్యేక పూజలు ఘనంగా జరిపారు. అర్చకులు వేకువజామునే అమ్మవార్లకు పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అలాగే ఇతర ఆలయాల్లోనూ పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఇళ్లల్లో ఇంటిల్లిపాదీ అమ్మవారికి రకరకాల పిండివంటలతో నైవేద్యం పెట్టి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు చేయించారు. జమ్మి వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజించారు. తర్వాత జమ్మి ఆకులను పెద్దలకు ఇచ్చి పాదాభివందనం చేసి వారి ఆశీర్వాదం పొందారు. పలు చోట్ల అమ్మవార్ల మూలవిరాట్‌లను పల్లకిలో ఊరేగించారు. అలాగే జమ్మివృక్షం దర్శనం చేయించారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, అక్టోబరు 13: మండలంలోని ఊబిచెర్ల గ్రామశివారులో గల జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రాజేష్ ద్విచక్ర వాహనంలో గుత్తి మండలం జక్కలచెరువుకు బయలుదేరాడు. ఊబిచెర్ల గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, అక్టోబరు 13: పట్టణంలోని దోని ముక్కల రోడ్డులో నివాసముంటున్న రాబీ (26)అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాబీ భర్త మహమ్మద్ ప్రస్తుతం కోలార్ జైలులో ఉన్నారు. ఆర్థిక, కుటుంబ సమస్యల కారణంగా రాబీ నిత్యం మదన పడుతుండేది. ఈ క్రమంలో ఆదివారం తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి..

గుంతకల్లుటౌన్, అక్టోబరు13: గుంతకల్లు-కల్లూరు రైలు మార్గంలో కొనకొండ్ల గేట్ వద్ద రంగస్వామి(54)అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆలూరు రోడ్డులో నివాసముంటున్న రంగస్వామి గొర్రెల కాపరిగా జీవనం సాగించేవాడు. మృతుడి భార్య 20 ఏళ్ల క్రితం తన ముగ్గురు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి అతడి మానసిక స్థితి బాగలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కొనగొండ్ల గేట్ వద్ద అతను రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

శెట్టూరులో యువకుడు..


బోయ నగేష్ (ఫైల్)

శెట్టూరు, అక్టోబరు 13: మండల కేంద్రంలో శనివారం రాత్రి యువకుడు బోయ నగేష్ (30) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయ నగేష్ (30) వృత్తి రీత్యా డ్రైవర్. ఇతడి భార్య రేవతి గత ఆగస్టు 15న అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక నిత్యం మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం తీవ్ర మనస్థాపం చెందిన అతను రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరు చనిపోవడంతో వారు అనాథలుగా మిగిలిపోయారని గ్రామస్థులు విలపించారు.

జడ్పీటీసీ సభ్యురాలి భర్త ఆఫీసుపై దాడి

తాడిపత్రి, అక్టోబరు 13: వైసీపీ జడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి భర్త రామశేఖర్ ఆఫీసుపై గుర్తుతెలియని దుండగులు దాడిచేసి అద్దాలు పగలగొట్టారు. గన్నెవారిపల్లి కాలనీలోని కడప రహదారిలో గల రామశేఖర్ ఆఫీసుపై ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడిచేసి అద్దాలు ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ కాటయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆలయాలను సందర్శించిన ఎస్పీ


బుగ్గరామలింగేశ్వరాలయంలో ఎస్పీ దంపతులు

తాడిపత్రి, అక్టోబరు 13: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకటరమణస్వామి ఆలయం, మండలంలోని ఆలూరు రంగనాథస్వామి ఆలయాన్ని ఆదివారం ఎస్పీ జగదీష్ సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయాల చరిత్రను అర్చకులు ఎస్పీకి వివరించారు. అంతకుమునుపు ఎస్పీ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి: ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ, అక్టోబరు 13: చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు మహిళలను సామూహిక అత్యాచారం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. చిత్తూరు జిల్లాలో బాలిక హత్య ఘటన మరువక ముందేచిలమత్తూరు మండలంలో మహిళలపై సామూహిక అత్యాచారం ఘటన చోటు చేసుకుందన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణకు తాను ఒక రక్షకుడిలా నిలబడతానని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనావాసంలోకి ములుగుపిల్లి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 13: అటవీ ప్రాంతంలో ఉండే వన్యప్రాణులు తరచూ జనావాసాల్లో వస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం పట్టణంలోని తేరుబజార్ వద్ద గల పోస్టు పాలనాయక్ అనే వ్యక్తి ఇంట్లోకి ములుగుపిల్లి వచ్చింది. దీంతో వెంటనే ఆ కుటుంబీకులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఆంజనేయు లు వచ్చి ములుగుపిల్లిని బంధించి అడవిలో వదలిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అటవీ ప్రాంతంలో ఆహారం దొరక్కపోవడంతోనే కొన్ని వన్యప్రాణులు ఇలా జనవాసాల్లోకి వస్తున్నట్లు తెలిపారు. ఎవరూ హాని కలిగించరాదన్నారు. ఎక్కడైనా ఉన్న ప్రాణులు కనబడితే తమకు సమాచారం అందించాలని కోరారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంరూరల్/యల్లనూరు, అక్టోబరు 13: రాబోవు ఐదురోజులు అకాల వర్షాలు కురవనున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రాయదుర్గం పురపాలక సంఘంలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు వర్షం వచ్చినపుడు ఎటువంటి సమస్యలు ఎదురైనా కమాండ్ కంట్రోల్ రూమ్ 9154566253 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పట్టణ ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే యల్లనూరు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా పశువుల కాపరులు, గొర్రెల కాపరులు రైతులు వర్షంపడే సమయంలో చెట్ల కింద ఉండరాదని సూచించారు.

మట్కాబీటర్ అరెస్టు

విడపనకల్లు, అక్టోబరు 13: మండలంలోని హావళిగి గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న ఓవ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పాల్తూరు ఎస్‌ఐ మురారి తెలిపారు. అందిన సమాచారం మేరకు గ్రామంలో తన సిబ్బందితో కలిసి దాడులు చేశామని, ఇందులో మట్కా నిర్వహిస్తున్న ఒకరిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 10,400 నగదును, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని అతని వద్ద నుంచి 20టెట్రా పాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు, అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, అక్టోబరు 13 : మండలంలోని ఉంతకల్లు గ్రామ సమీపంలోని తోటలో ఆదివారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అందిన సమాచారంతో పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో పేకాట ఆడుతున్న వారిని పట్టుకుని వారి నుంచి రూ. 10,850 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వారిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరచనున్నట్లు చెప్పారు.

హెచ్చెల్సీలో గల్లంతైన వ్యక్తి శవం లభ్యం

కణేకల్లు, అక్టోబరు 13: మండలంలోని యర్రగుంట వద్ద హెచ్‌ఎల్‌సీలో రెండు రోజుల క్రితం కిషోర్‌కుమార్(43) అనే వ్యక్తి గల్లంతైన విషయం తెలిసిందే. కాగా ఆదివారం కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర చెరువులో ఆయన మృతదేహం లభ్యమైంది. కుటుంబ సమస్యల కారణంగా కిషోర్‌కుమార్ తన వస్తువులను హెచ్చెల్సీ 5వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఉంచి కాలువలోకి దూకాడు. స్థానికులు కిషోర్‌కుమార్ కాలువలో గల్లంతైనట్లు పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదివారం శవం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిర్వహించారు.

గాయత్రీమాతను దర్శించుకున్న జేసీపీఆర్


జేసీ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

తాడిపత్రి, అక్టోబరు 13: దసరా పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న గాయత్రీమాత అమరలింగేశ్వర స్వామి ఆలయాన్ని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గాయత్రీమాతకు, అమరలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అర్చకులు వేద ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు.

సీఐ ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లుటౌన్, అక్టోబరు13: గుంతకల్లు రూరల్ సీఐగా ఎన్ ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి సీఐగా ఉన్న మహేశ్వరరెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

సీఐ గౌస్‌కు సన్మానం


సీఐను సన్మానించిన టీడీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబరు 13: ఉరవకొండ రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన చిన్నగౌస్‌ను టీడీపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సర్కిల్ కార్యాలయంలో నాయకులు ప్యారంకేశవానంద, గోవిందు, రెడ్డిమాసి రవీంద్ర, గోపాల్ తదితరులు కలిసి సీఐను పూలమాలు, శాలువాతో సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


చంద్ర (ఫైల్)

రాయదుర్గంరూరల్, అక్టోబరు 13: కర్ణాటకలోని చెళ్లకెర తాలూకా తళుకు గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయదుర్గం మండలం వడ్రవన్నూరుకు చంద్ర(44) మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చంద్ర మొలకాల్మూరు తాలూకా మొగలాలి గ్రామంలో పెళ్లి చేసుకుని తళుకులో అగ్రికల్చర్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంలో తళుకు నుండి మోగులహళ్లికి వస్తుండగా అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వడ్రవన్నూరు గ్రామానికి తరలించారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు సంతానం ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

డీ.హీరేహాళ్, అక్టోబరు 13: విద్యుదాతంతో మండల కేంద్రానికి చెందిన యువకుడు ఎర్రిస్వామి(16) మృతి చెందాడు. నాగరాజు, లక్ష్మీ దంపతులకు ముగ్గురు సంతానం. వీరు వ్యవసాయంతో పాటు గొర్రెలు కాస్తూ జీవనం సాగించేవారు. కాగా రోజు మాదిరిగానే శనివారం కూడా గొర్రెలు మేపేందుకు ఎర్రిస్వామి తన సోదరుడు భీమేష్‌తో కలిసి గ్రామ సమీపంలో పొలాల వద్దకు వెళ్లాడు. అయితే అక్కడున్న స్టేవైర్‌ను అతను ప్రమాదవశాత్తూ తాకడంతో షాక్‌కు గురై అక్కడే కుప్పకూలాడు. సోదరుడు ఈ విషయాన్ని తల్లిదండ్రుల కు ఫోన్ చేసి చెప్పగా.. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించారు. ఎర్రిస్వామి అప్పటికే మృతి చెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వాల్మీకి జయంతికి తరలిరండి

గుమ్మఘట్ట, అక్టోబరు 13: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా జరపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమని టీడీపీ వాల్మీకి సాధికార రాష్ట్ర కన్వీనర్ పూల నాగరాజు ఆదివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వాల్మీకి జయంతి ప్రభుత్వ పండుగలా జరుపుతామన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే వాల్మీకి జయంతి వేడుకలకు జిల్లాలోని వాల్మీకులందరూ హాజరవ్వాలని కోరారు.

వేదావతి హగరికి భారీగా వరద నీరు

బొమ్మనహాళ్, అక్టోబరు 13: కర్ణాటకలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని ఉద్దేహాళ్ వే దావతి హగరికి భారీగా వరదనీరు వస్తోంది. మండలంలో కూడా రెండు రోజుల క్రితం వర్షా లు కురవడంతో ఇప్పటికే వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీనికితోడు వేదావతి హగరికి వరదనీరు తోడవడంతో మరింత నీరు వాగులు వంకలకు చేరుతున్నాయి. ఇప్పటికే పత్తి, మిర ప, జొన్న, మొక్క జొన్న పంటలు నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్దేహాళ్ వేదావతి హగరి భారీ వరదనీరు రావడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది.

దసరా వేడుకల్లో ఎమ్మెల్యే అమిలినేని


సోదరికి దసరా శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు 13: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన సొంత గ్రామమైన ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో శనివారం దసరా ఉత్సవాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు అల్లుళ్ల ధర్మతేజ, అవినాష్ ఇతర కుటుంబ సభ్యులందరూ కలిసి దసరా ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. తొలుత సంప్రదాయ ప్రకారంగా ఎమ్మెల్యే పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. తన అక్కా బావ దేవినేని పద్మావతి, దేవినేని మోహన్‌కు పాదాభివందనం చేశారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

గుత్తి, అక్టోబరు13: గుత్తి నుంచి గుంతకల్లుకు వెళ్లే రహదారి గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు చికెన్ శీనా, రాజా, లక్ష్మణ్ చౌదరి, ప్రతాప్ తదితరులు ఆదివారం గుంతలను పూడ్చివేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచన మేరకు టిప్పర్లతో మట్టిని తోలించి గుంతలు పూడ్చివేయించామని తెలిపారు.

కార్యకర్తలను డబ్బుతో కొనలేం: జేసీపీఆర్

తాడిపత్రి, అక్టోబరు 13: ఎవరైనా సరే కార్యకర్తలను డబ్బుతో కొనలేమని, కేవలం మంచి మనసుతోనే చేరదీయాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. పెద్దారెడ్డీ.. కార్యకర్తలను డబ్బులతో కొనలేవని, కేవలం మనసుతోనే గెలవాలని, ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కేసుల్లో ఉన్న నీ కార్యకర్తలను కాపాడుకోవాలని అన్నారు. యల్లనూరు, పుట్లూరు మండలాలకు చెందిన కొందరు నాయకులు గతంలో వైసీపీలో ఉండి ప్రస్తుతం టీడీపీలోకి వచ్చి ఏదో చేయాలని చూస్తే ఊరికే ఉండమని హెచ్చరించారు. లబ్ధికోసమే పార్టీలోకి వస్తే బాగోదని హెచ్చరించారు. కష్టపడి పార్టీకి పనిచేసిన వారిని ఎప్పటికి మర్చిపోమన్నారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కష్టపడిన వారికి గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గతంలో పుట్లూరు, యల్లనూరు మండలాలు తాడిపత్రి సమితిలో ఉండేవని తెలిపారు.

నేటి నుంచి పల్లె పండుగ

యాడికి, అక్టోబరు13: పల్లె పండుగ వారోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 14న చందన, వేములపాడు, 15న లక్షుంపల్లి, తూట్రాళ్లపల్లి, 16న కోనుప్పలపాడు, వెంగన్నపల్లి, యాడికి, 17న రాయలచెరువు, 18న నగరూరు, చిక్కేపల్లి, 19న కమలపాడు, 20న గుడిపాడు, పుప్పాల, నిట్టూరు గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో గోకులం షెడ్లు, సీసీరోడ్లు, పారంపాండ్లు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఉద్యానవన మొక్కల పెంపకంలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

శెట్టూరు : మండలంలోని 16 గ్రామ పంచాయతీలో సోమవారం ఈ నెల 19వ తేదీ వరకు పల్లె పండుగ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామా రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 14న చిన్నంపల్లి, 15న బొచ్చుపల్లి, చెర్లోపల్లి, ఖైరేవు, 16న చింతర్లపల్లి, లక్ష్మంపల్లి, మాకొడికి, 17న పెరుగుపాలెం, తిప్పనపల్లి, 18న అనుంపల్లి, ములకలేడు, శెట్టూరు, యాటకల్లు, 19న ఐదుకల్లు, కనుకూరు గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలు

శెట్టూరు, అక్టోబరు 13: మండలంలోని ఖైరేవు గ్రామంలో శనివారం దసరా పండగ సందర్భంగా ట్రాక్టర్లతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఇందులో వైసీపీకి చెందిన హనుమంతరాయుడు ట్రాక్టర్‌ను ఈశ్వరప్ప కాలు మీద పోనించాడు. దీంతో ఈశ్వరప్ప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి ఇంటికి వెళ్లిన అనంతరం అతడిపై వైసీపీ శ్రేణులు మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ దాడి చేసి ఇనుపరాడ్‌లతో తలపై కొట్టి గాయపరిచారు. ఈ క్రమంలో ఇరు వర్గాలు కొద్దిసేపు ఘర్షణ పడ్డారు. తర్వాత ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డ టీడీపీ కార్యకర్త ఈశ్వరప్పను ఆ పార్టీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామరాజు, పట్టణ అధ్యక్షుడు శర్మాస్ వలి తదితరులు ఆదివారం పరామర్శించారు.

మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, అక్టోబరు 13 : మనవడి పుట్టిన రోజుకు నగరంలోకి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. పుట్లూరు మండలం ఎల్లుట్లకు చెందిన అంకాలమ్మ ఈనెల 9వ తేదీ తన మనవడి పుట్టిన రోజు వేడుకలకు నగరంలోని బుడ్డప్పనగర్‌లోని కుమార్తె ఇంటికి వచ్చింది. ఆమె 10వతేదీ ఉదయం 9:45గంటలకు ఊరికెళ్తానని చెప్పి నవోదయకాలనీ నుంచి బయలుదేరింది. కానీ ఊరికెళ్లలేదు. ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ రావడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. కొడుకు మిద్దె రమేష్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కాలవ జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు, ప్రజలు


కాలవకు శుభాకాంక్షలు తెలుపుతున్న బొమ్మనహాళ్ టీడీపీ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న తదితరులు

రాయదుర్గం, అక్టోబరు 13: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆయన నివాసంలో పెద్ద ఎత్తున ప్రజలు, అధికారులు, పార్టీశ్రేణులు తరలి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు పూలమాలలు, శాలువాలతో సన్మానాలు చేశారు. గజమాలలతో సత్కరించారు. గుమ్మఘట్ట మండల నాయకుడు కాలవ సన్నన్న ప్రత్యేకంగా అభినందించారు. వివిధ శాఖల అధికారులు మెమోంటోను సమర్పించారు. సాయంత్రం వరకు ఎమ్మెల్యే నివాసంలో పండగ వాతావరణం నెలకొంది. బొమ్మనహాళ్ మండల టీడీపీ నాయకుడు, దర్గాహోన్నూరు మాజీ సర్పంచ్ కేశప్ప ఆధ్వర్యంలో 60 కిలోల కేక్‌ను కట్ చేశారు. అదేవిధంగా మరో టీడీపీ నాయకుడు కోళకుర్తి సుదర్శన్ 60 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే చేత కట్ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బాలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి, అప్పరావు, మాలపాటి ధనంజయ, కొత్తపల్లి మహేంద్ర, పయ్యావుల మోహన్, పయ్యావుల అనిల్, నవీన్, సోమనాథ్‌గౌడ్, గ్యాస్ గోవిందు, రాతింటి వన్నూరుస్వామి, కావలి రాము, రవిచంద్ర సాగర్, పయ్యావుల నాగరాజు, మల్లీడు శీన, సాల్లాపురం బాబు, లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, వేలూరు మరియప్ప, కొత్తపల్లి మల్లికార్జున, బసవరాజు, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, మిల్ నాగప్ప, కురుబ నాగరాజు, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్, మారుతి, నరేంద్ర, వన్నారెడ్డి, చాంద్‌బాషా, వెంకటేశులు, రుద్రముని, శరభనగౌడ్ ,బ్రిడ్జి కాంట్రాక్టర్ రామసుబ్బారెడ్డి, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గం పట్టణ టీడీపీ నాయకుల శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాయదుర్గం మండల టీడీపీ నాయకులు, అధికారులు

రాయదుర్గంరూరల్: రాయదుర్గం పట్టణంలో టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచులు రాజశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, మల్లేష్, నాయకులు భోజరాజు, కాటా వెంకటేశులు, తిమ్మారెడ్డి, గిరిధర్ నాయుడు, భీమసేనరావు, లచ్చన్నచౌదరి, వీరేష్, గంగాధర్‌శెట్టి, గంగప్ప, ప్రసాద్, హనుమంతు, తిప్పేస్వామి, సుంకప్ప, సిద్ధప్ప, గోవిందరాజులు, జోగప్ప, లక్ష్మణ, సీతారాములు, జిలాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల అన్నదానం

గుమ్మఘట్ట: గుమ్మఘట్ట మండలంలో కాలవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, నాయకులు పైదొడ్డి రాజు, జేలోడు సంజీవ, సత్యనారాయణ, సర్పంచ్ నాగరాజుతో పాటు మరికొంతమంది రాయదుర్గం పట్టణ సమీపంలోని రామకృష్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

సేవాదృక్పథంతో చికిత్సలు అందించండి

రాయదుర్గం, అక్టోబరు 13: రోగులకు సేవాదృక్పథంతో చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆర్ఎంపీ వైద్యులకు సూచించారు. పట్టణంలోని హఠకేశ్వరస్వామి కళ్యాణమంటపంలో ఆదివారం ఆర్ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా వచ్చి వాటిని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్ఎంపీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానన్నారు.ఇక నుంచి కక్షసాధింపులు, అధికారుల వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలందించాలని సూచించారు. తొలుత ఎమ్మెల్యేను ఆర్ఎంపీలు సన్మానించారు.

